క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికల ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మహనీయుల చిత్రపటాలను గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శివకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ చరణ్ సహకారంతో వీటిని అందించారు. మాజీ ఎంపీటీసీ నర్సిరెడ్డి, పాలాది శివకృష్ణ, హెచ్‌ఎం అజయ్, కవిత, అజిత్ రెడ్డి, బ్రహ్మం, బాలేశ్వర, పరశురాం, బాలయ్య, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

కొల్లాపూర్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో చాలామంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ వస్తే ఇళ్లు వస్తాయనే నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్ పట్టం కట్టారన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు ఇవ్వాలని కోరారు.

వాల్‌పోస్టర్ విడుదల



అచ్చంపేట రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 14,15 తేదీలలో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో నిర్వహించే మున్సిపల్ కార్మికుల రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. మహాసభకు భారీగా తరలివెళ్లాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాండు, హుస్సేన్, లక్ష్మయ్య, బాలయ్య, వెంకటయ్య, సురేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ బొమ్మసాని నర్సింహ కుమారుడు, బొమ్మసాని లక్ష్మణ్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బీఆర్‌ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి కుమారుడు శశిధర్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట అర్థం రవి, పాండు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

కొల్లాపూర్ రూరల్: ఎస్సీ, ఎస్టీ బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులకు సంబంధించి రూ. 220 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సున్నపు తండాలో గిరిజనులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు విడుదల చేయకపోవడంతో పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇంటికి పంపిస్తున్నారన్నారు. దీంతో ఎంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని లేని పక్షంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. గిరిజన సంఘం నాయకులు, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కోడేరు: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన చాకలి కొండలయ్యకు రూ.21వేలు, కృష్ణవేణికి రూ.20 వేలు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. సోమవారం మాజీ సర్పంచ్ మశయ్య లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్క్రాప్ మెటీరియల్ బహిరంగ వేలం

కందనూలు: వినియోగంలో లేని వాటర్‌సప్లయ్, ఎలక్ట్రికల్, శానిటేషన్ విభాగాల మెటీరియల్స్‌ను ఈ నెల 18వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు రుసుము రూ.1000 చెల్లించి, రూ.30,000 డీడీ జతపరిచి 17వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు సెల్: 9550942030 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేనా?

- అవగాహన లేక లబ్ధిదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



తాడూరులో నిర్మించిన నమూనా ఇల్లు



ఇంద్రకల్‌లో బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

తాడూరు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో అర్హులైన వారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా సకాలంలో బిల్లులు మంజూరు చేయడం లేదు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. పథకంపై అధికారులు అవగాహన కల్పించడంలో విఫలం అయ్యినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

లబ్ధిదారులకు తప్పని తిప్పలు

వివిధ నిబంధనలతో లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం రూ. 5 లక్షలు మంజూరు చేస్తోంది. 60, 120 గజాల్లోనే పునాదులు నిర్మించుకోవాలంటూ కొర్రీలు పెట్టింది. దీంతో ఎంపికైన వారు ఇళ్లు నిర్మించుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు. మంజూరైన వాటిలో 50 శాతం కూడా ఇప్పటివరకు నిర్మాణాలు పూర్తి కాలేదు. కేవలం మార్కింగ్ చేసి వదిలేశారు. నిర్మించుకున్న వారికి కూడా నిధులు సకాలంలో అందకపోవడంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి.

మండలంలో ఇలా..

మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు 546 ఇళ్లు మంజూరు అయ్యాయి. 180 వరకు బేస్‌మెంట్ కట్టారు. 26 ఇళ్లు మాత్రమే లెంటల్ లెవల్ వరకు పూర్తయ్యాయి. 280 ఇళ్లు ఇప్పటికి పనులు ప్రారంభించలేదు. బేస్‌మెంట్ వరకు పూర్తిచేసిన వారికి 80 శాతం బిల్లులు అకౌంట్లలో జమ అయినట్లు అధికారులు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం

గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. పూర్తిగా కట్టుకోలేని వారికి సూచనలు సలహాలు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో మంజూరైన లబ్ధిదారుల జాబితాను గ్రామాల వారిగా పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతం ఎన్నికల హడావిడిలో గ్రామాలకు వెళ్లలేకపోయాం.

– అంజనేయులు, ఎంపీడీఓ, తాడూరు

మున్సిపల్ కార్మికులకు వేతనం పెంచాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్ రూరల్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు ఆర్. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడి సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో రోజురోజుకు జనాభా పెరుగుతోందని దీంతో కార్మికులపై పనిభారం అధికమవుతోందన్నారు. జనాభా ప్రకారం అదనంగా కార్మికులకు నియమించాలన్నారు. కార్మికుల పని భారం తగ్గించి సెఫ్టీ పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలరాజు, వెంకటయ్య, కృష్ణయ్య, రామస్వామి, వెంకటయ్య, బాలస్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లోని మర్రి నివాసంలో సోమవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. మర్రి జనార్దన్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జోగు ప్రతాప్, వెంకటస్వామి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రవి, జగ్జీవన్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



పెద్దకొత్తపల్లి: ప్రైవేటు వాహనదారులు పరిమితికి మించి కూలీలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సతీష్ హెచ్చరించారు. సోమవారం పెద్దకొత్తపల్లి, కోడేరు, కొల్లాపూర్ మండలాలలోని ఆయా గ్రామాల నుంచి సుదీర ప్రాంతాలకు కూలీలను చేరవేసే ప్రైవేటు వాహనాలను పోలీసులు తనిఖీ నిర్వహించారు. తనిఖీలో పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాహనాల డ్రైవర్లు, కూలీలకు అవగాహన కల్పించారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణిస్తే ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు ఉన్నారు.

పింఛన్లు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి

చారకొండ: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువు తదితర పింఛన్లు పోస్టాఫీసు ద్వార కాకుండా బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని జూపల్లి గాంధీజీ యువజన సంఘం అధ్యక్షుడు నాయిని పరంజ్యోతి సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

పేద విద్యార్థినికి చేయూత

అచ్చంపేట రూరల్: అమ్రాబాద్ మండలం మాధవానిపల్లికి చెందిన అనూషకు సోమ వారం సీబీఎం చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ రూ. 25 వేల చెక్కును అందజేశారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం పరిధిలో కాలేజీ ఆఫ్ అగ్రికల్చర్ రెండో సంవత్సరం చదువుతున్న అనూషకు ఆర్థికంగా సతమతమవుతోంది. ఈ విషయాన్ని విద్యార్థిని తండ్రి రామస్వామి డాక్టర్ అనురాధ దృష్టికి తీసుకొచ్చాడు. వెంటనే ఆమె స్పందించి ఆర్థికంగా సాయం అందించారు.

అమ్రాబాద్: మండల కేంద్రానికి చెందిన రేణమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మైనార్టీ యువకులు రూ.8000 వేలు ఆర్థికసాయం అందజేశారు. చికిత్స నిమిత్తం సీబీఎం ట్రస్టుకు సంబంధించిన అంబులెన్స్ ద్వారా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని చెదురుపల్లి గ్రామానికి చెందిన పోలే మహేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు.

డిజిటల్ లిటరసీపై ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న ఏఎంఓ షర్ఫుద్దీన్

కందనూలు: డిజిటల్ లిటరసీపై 6 నుంచి 9వ తరగతులకు బోధించే భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఏఎంఓ షర్ఫుద్దీన్ హాజరై శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం ఏ బుక్ ఆన్ డిజిటల్ లిటరసీకి సంబంధించిన విషయాలను పాఠ్యప్రణాళికలో చేర్చారని విద్యార్థులకు డిజిటల్ సామర్థ్యాలు, కృత్రిమ మేధస్సు వంటి అంశాలపై నిజ జీవిత సన్నివేశాల ఆధారంగా కృత్యాధార బోధన చేయాలని సూచించారు. వివిధ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు.

42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక దేవకి ఫంక్షన్ హాలులో సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బోనాసి రాంచందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, సగర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు బీసీ సంఘాల నాయకులు తిమ్మాజిపేట పాండు, అడ్వకేట్ తిరుపతయ్య, వెంకటేష్, ఖానాపూర్ శరత్, యాదగిరి, సామాజికవేత్త, రాజశేకర్‌శర్మ, సీపీఐటీయూ నాయకులు పాదిల రామయ్య, పలువురు నాయకులు పాండు, తదితర నాయకులు హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చే వరకు పోరాడుతామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ విషయంలో బీసీలు పార్టీలకు అతీతంగా ఏకం కావాలని కోరారు. బీఎస్పీ నాయకుడు పృథ్వీరాజ్, అశోక్, రాజు, బాలనాగులు, శ్రీను, రామకృష్ణ, రాంచందర్‌లు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



కల్వకుర్తి రూరల్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్న మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన నాగయ్య కుమారుడు మల్లేష్‌కు బీజేపీ నాయకుడు బండల రామచంద్రారెడ్డి రూ.21 వేలు విలువ చేసే ట్యాబ్‌ను సమకూర్చగా సోమవారం ఆచారి అందించాడు. కార్యక్రమంలో రాంభూపాల్ రెడ్డి, మంగళపల్లి రాంరెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

కందనూలు: భగవాన్ సత్య సాయి బాబా శత జయంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు 45 రోజుల పాటు ఉచితంగా టైలరింగ్, జ్యూట్ బ్యాగుల తయారీ, మగ్గం వర్క్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు కన్వీనర్ హకీం విశ్వప్రసాద్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరంలో ఈ నెల 23 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భోజన, నివాస వసతి ఉంటుందని వివరించారు. ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు సెల్: 6281412245, 9441303182 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అద్దె భవనంలో సివిల్ సప్లయ్ గోదాం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సివిల్ సప్లయ్ గోదాం అద్దె భవనంలో కొనసాగుతోంది. దీంతో ప్రతి నెల మొదటి వారంలోనే రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు డీలర్లకు ఇబ్బందులు తప్పడంలేదు. అద్దె భవనంలో ఉన్న గోదాంలో 10 లారీల బియ్యం స్టాక్ చేసుకునేందుకు సామర్థ్యం ఉంది. మండలంలో 38 రేషన్ షాపులతో పాటు కోడేర్ మండలంలో 8 రేషన్ షాపులకు ఈ గోదాం నుంచే రేషన్ సరుకులు సరఫరా అవుతున్నాయి. జడ్చర్ల నుంచి వచ్చిన లారీలలోని రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ గోదాంలో దించేందుకు అవకాశం లేకపోవడంతో నేరుగా గ్రామాలల్లోని రేషన్ దుకాణాలకు పంపిస్తున్నారు. ప్రతి నెల కొన్ని గ్రామాల్లో మొదటి వారంలో బియ్యాన్ని పంపిణీ చేయకుండా ఆలస్యం అవుతున్నాయి. సివిల్ సప్లయ్ గోదాం నిర్మాణం కోసం నిధులు మంజూరైన ప్రభుత్వ స్థలం లేకపోవడంతో గోదాం నిర్మాణం చేపట్టలేదు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి సివిల్ సప్లయ్ గోదాంను నిర్మించాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల వర్కర్ల సమ్మె



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మన్ననూర్: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో డైలీ వెజ్ వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 32 రోజులుగా డైలీవెజ్ వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం మన్ననూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ముందు 72 గంటల నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30–35 ఏళ్లుగా వసతి గృహాల్లో రాత్రింబవళ్లు కష్టపడి పని చేస్తున్న వర్కర్లకు నెల జీతం పెంచాల్సిందిపోయి తగ్గించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలకు మించి ఎక్కువ సమయంతో పనిచేస్తున్నారన్నారు. జీఓ నంబర్ 64ను రద్దు చేయడంతో పాటూ టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు. వర్కర్లకు సమ్మెకు ప్రజా సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, పర్వతాలు, బాలయ్య, సయ్యద్, వెంకటేష్, మద్దతు తెలిపారు. డైలీవైజ్ వర్కర్ జెఏసీ నాయకులు మద్దెల సురేందర్, భరత్, ఓంప్రకాష్, పర్వతాలు, సురేష్‌తో పాటూ వర్కర్లు ఎల్లమ్మ, పద్మ, నీల, శివ, ప్రచండ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



గోకారం వద్ద బ్రిడ్జిపై నుంచి పారుతున్న వర్షపునీరు



ఎర్రవల్లి, గోకారం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

చారకొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి భారీవర్షం కురిసింది. లోలెవల్ వంతెనలు, బ్రిడ్జిల మీదుగా వరద ఉధృతంగా ప్రవహించింది. దీంతో మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 104.2 మీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మండల కేంద్రంతో పాటు పరిధిలోని గారమాలో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని గోకారం చంద్రాయన్ పల్లి, ఎర్రవల్లి గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. ఎర్రవల్లి వాగు వద్ద రోడ్డు కోతకు గురైంది. గోకారం నుంచి దేవరకొండ ప్రధాన రహదారి వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జిపైనుంచి వరద ప్రవహిస్తోంది. బొమ్మల గుడిసెలులో వాగు ఉధృతంగా ప్రవహించడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



పొలిశెట్టిపల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూర్: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. మండలంలోని పొలిశెట్టిపల్లిలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేసి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లెలను పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అదేవిధంగా ఓటు చోరీ సంతకాల సేకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి ఫజల్, నాయకులు కాశన్నయాదవ్, యుగేందర్‌రెడ్డి, పరమేష్, ఎల్లికంటి శ్రీను, జయప్రకాష్‌రెడ్డి, రేణయ్య, శత్రునాయక్, సునీల్, రాంప్రసాద్‌గౌడ్, అంజీ, మల్లేష్, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ

అచ్చంపేట: ఓటు చోరీపై సోమవారం పట్టణంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై మాట్లాడారు. ఓట్ల చోరీ చేస్తూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ సంఘం చైర్మన్ చత్రు నాయక్, మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, కాశన్న యాదవ్, నాయకులు సునీల్, రమేష్, అంజి, మల్లేష్, స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 20 దరఖాస్తులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని 67 మద్యం దుకాణాలకు సోమవారం 20 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి తెలిపారు. నాగర్‌కర్నూల్ స్టేషన్ పరిధిలో 7, కొల్లాపూర్ స్టేషన్ పరిధిలో 3, అచ్చంపేట పరిధిలో 4, తెలకపల్లి పరిధిలో 3, కల్వకుర్తి స్టేషన్ పరిధిలో 3 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. మొత్తం 105 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. మరో 5 రోజులు మాత్రమే దరఖాస్తుకు గడువు ఉందని వెల్లడించారు.

నిందితుడి రిమాండ్

తెలకపల్లి: ఈ నెల 7న మండల కేంద్రంలో కోహినూర్ ఫంక్షన్‌హాలులో ఇనుము, ఇతర సామాగ్రిని చోరీ చేసిన దొంగ పట్టుబడ్డాడు. సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆనంద్ అలియాస్ మధు ఇనుమును తరలిస్తుండగా పోలీసులు గుర్తించి పటుకున్నారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ నరేష్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పద్య పోటీల్లో ఎల్లూరు విద్యార్థుల ప్రతిభ



కొల్లాపూర్ రూరల్: గుర్రం జాషువా జయంతిని పురష్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పద్య పోటీలలో మండలం ఎల్లూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యామిని, రోహిత్‌లు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ గోల్డ్‌మెడల్, నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం రాజవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



పాన్‌గల్: పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారు ఉత్తమఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఆనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కస్తూర్బా విద్యాలయం, ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, గోప్లాపూర్ యూపీఎస్, కేతేపల్లి ప్రాథమిక పాఠశాల, జమ్మాపూర్ యూపీఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుశాతం, విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. హెచ్‌ఎంలు, సీఆర్పీ గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

గుంతలమయంగా బీటీ రోడ్డు



బురదమయంగా అంబగిరి రోడ్డు

బల్మూర్: మండలంలోని అనంతవరం నుంచి అంబగిరి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. పదేళ్ల కిందట నాలుగు కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం రహదారి కంకర తేలి గుంతలమయంగా మారిదిం. గ్రామానికి వెళ్లే ఆర్‌టీసీ బస్సును కూడా మూడేళ్ల కిందట నిలిపివేశారు. వర్షాకాలంలో రాకపోకలు కొనసాగించేందుకు గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. నెల రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డు బురదమయంగా దర్శనమివ్వడంతో అడుగుతీసి అడుగువేయలేని దుస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోయారు. మైలారం మీదుగా చుట్టూ తిరిగి మండల కేంద్రానికి చేరాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.